క్లుప్తంగా

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ



భవానీపురం(విజయవాడపశ్చిమ): వరద ముంపు ప్రభావిత ప్రాంతాల్లోని బాధితులకు చాత్తాద శ్రీవైష్ణవ సంఘం నెలకు సరిపడా బియ్యం, నిత్యావసరాల సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. నవ్యాంధ్రప్రదేశ్ చాత్తాద శ్రీవైష్ణవ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ అక్షయపాత్ర శ్రీనివాస్, మధురాంతకం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం భవానీపురంలో సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కేశవపట్నం గిరిబాబు, మడకర నారాయణబాబు, మధురాంతకం సాయి చైతన్య, టి.పూర్ణయ్య పాల్గొన్నారు. ఓం శాంతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. నిర్వాహకులు తులజా భవానీ, జానకి, జోస్ మణికొండ మాట్లాడుతూ పిన్నమనేని శ్రీలక్ష్మి నాయకత్వంలో ట్రస్ట్ నగరంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో నిర్విరామంగా సేవలు అందిస్తుందని తెలిపారు.

మధురం.. వాగ్గేయకార సంకీర్తనం



విజయవాడకల్చరల్: కంచికామకోటి పీఠస్థ శ్రీ పద్మావతి సమేత, శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం కళా వేదికపై సంగీత విద్వాంసులు విష్ణుభొట్ల సోదరీమణులు నిర్వహించిన ముత్తుస్వామి దీక్షితార్ సంకీర్తనల కార్యక్రమం మధురంగా సాగింది. దసరా ఉత్సవాల్లో భాగంగా సంగీత మూర్తిత్రయంలో ఒకరైన ముత్తుస్వామి దీక్షితార్ రచించిన కీర్తనలను మధురంగా ఆలపించారు. నీలాయ తాక్షితో ప్రారంభించి, కామాక్షి స్వరజతి, శంకరీ శంకురు, దేవీ బ్రోవ సమయమిదే, మాయమ్మ, కరుణ జూడు, కనకశైల విహారిణి, పాలించు కామాక్షి తదితర కీర్తనలను ఆలపించారు. బీవీఎస్ ప్రసాద్ మృదంగంపై, పాలపర్తి ఆంజనేయులు వయోలిన్‌పై ఘటంపై హరిబాబు సహకరించారు. దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ మాగంటి వేణుగోపాల్ విద్వాంసులను సత్కరించారు.

విద్యార్థులకు కూచిపూడి నాట్యంలో శిక్షణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేటలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం' కార్యక్రమం ఆదివారం జరిగింది. ఇందులో భాగంగా విద్యార్థులతో నీతి కథలు, ప్రముఖుల జీవిత చరిత్రలు.. ఇతర పుస్తకాలు చదివించారు. ప్రతి ఆదివారం నిర్వహించే చదవడం మాకిష్టం కార్యక్రమంలో విద్యార్థులు ఉల్లాసంగా పాల్గొన్నారు. అనంతరం సరస్వతీ సామ్రాజ్యం వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా కూచిపూడి నాట్య శిక్షణ ఇచ్చారు. నృత్య శిక్షకురాలు జ్యోత్స్న కూచిపూడిలో మెలకువలు నేర్పించారు. విద్యార్థులు నృత్య రీతులను సాధన చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.రమాదేవి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అవధాన సరస్వతికి పద్య నీరాజనం



విజయవాడ కల్చరల్: పలకరిస్తే పద్యం, సమస్య చెపితే పద్యం, అప్రస్తుత ప్రసంగం చేస్తే పద్యం. అవధాని తాతా సందీప్‌శర్మ మూడు గంటల పాటు నిర్వహించిన అష్టావధానం సాహితీ పరిమళాలు వెదజల్లింది. శ్రీ సద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో శరన్నవరాత్రుల కార్యక్రమంలో భాగంగా ఆదివారం శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహించిన అవధానం పండితులతో పాటు అభిమానులను ఆకట్టుకుంది. విద్యావేత్త, మల్లాప్రగడ శ్రీమన్నారాయణ సంచాలకత్వంతో అవధాని తాతా సందీప్‌శర్మ అష్టావధాన కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారు. నల్లాన్ చక్రవర్తుల సాహిత్(నిషిద్ధాక్షరి), డాక్టర్ కానుకొల్లు బాలకృష్ణ(సమస్య), కావూరి సత్యవతి(దత్తపది), డాక్టర్ ధూళిపాళ రామకృష్ణ(వర్ణన), మల్లాప్రగడ నందకిషోర్(వ్యస్తాక్షరి), పంతుల గాయత్రి(ఆశువు), పంతుల తపస్వి(అప్రస్తుత ప్రసంగం) అంశాలపై అవధానికి ప్రశ్నలు సంధించగా వాటికి పద్యరూపంలో సమాధానమిచ్చారు. కార్యక్రమంలో సద్గురు సంగీత సభ కార్యదర్శి గౌరీనాథ్, అధ్యక్షుడు ప్రసాద్ పాల్గొన్నారు. అవధానిని నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

లలితా మాతా పాహిమాం..



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో దసరా మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నాల్గవ రోజైన ఆదివారం శ్రీలలితాత్రిపుర సుందరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలిరావడంతో ఉదయం నుంచే క్యూలైన్లలో భక్తుల రద్దీ నెలకొంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఆకట్టుకున్న కేరళ దప్పు వాయిద్యాలు





దుర్గమ్మ సన్నిధిలో భవానీలు



కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు



వైభవంగా సాగుతున్న నగరోత్సవ సేవ



భక్తులతో నిండిన క్యూలైన్లు



హారతి తీసుకుంటున్న భక్తజనం



నృత్యం ప్రదర్శిస్తున్న చిన్నారులు

ఘాట్లలో ఏర్పాట్లపై ప్రచారం నిల్



భవానీ ఘాట్‌లో జల్లు స్నానం చేస్తున్న భక్తులు

జిల్లా యంత్రాంగంలో కొరవడిన సమన్వయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): తెలుగు పర్వదినాల్లో అతి పవిత్రంగా భావించే దసరా శరన్నరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం ప్రతి ఏడాది గట్టు వెనుక ప్రాంతంలోని పున్నమి, భవానీ ఘాట్లలో వివిధ ఏర్పాట్లు చేయడం పరిపాటి. జల్లు స్నానం, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాటు, సమాచార కేంద్రం, కేశఖండన శాల, ఉచిత వైద్య శిబిరం, మరుగుదొడ్లు, తాగునీరు వంటి సౌకర్యాలను కల్పించటమే కాకుండా వాటికి సంబంధించి శానిటరీ, వైద్యాధికారులు, సిబ్బందిని నియమించారు. అయితే ఆయా ఏర్పాట్లకు సార్థకత కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. దీనిపై విస్తృత ప్రచారం చేయాల్సి ఉంటుంది. ఘాట్లలో సౌకర్యాలు, ఏర్పాట్లకు సంబంధించి నిత్యం పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు మాత్రం మొక్కుబడిగా వ్యవహరిస్తున్నారు తప్ప చిత్తశుద్ధి, అంకిత భావంతో పని చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వీవీఐపీ ప్రొటోకాల్ సెంటర్ వెనుక భాగంలో ఏర్పాటు చేసిన సమాచార కేంద్రం, కేశఖండన శాల, ఉచిత వైద్య శిబిరం షెడ్ ఎవరికీ కనబడక పోవడం గమనార్హం. వాటికి సంబంధించిన బోర్డులను ప్రొటోకాల్ సెంటర్ వద్ద ఏర్పాటు చేస్తే వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుందని భక్తులు కోరుతున్నారు.

దేవస్థానం బస్సులలో ఘాట్ల వద్దకు తరలించాలి

దసరా ఉత్సవాలకు రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు విజయవాడ వచ్చి ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న అమ్మవారిని దర్శించుకుంటారు. ఈ క్రమంలో బస్సులలో వచ్చే కొందరు రాజీవ్ గాంధీ పార్క్ వద్ద వాహనాలను పార్క్ చేసుకుని అక్కడ చేసిన ఏర్పాట్లను ఉపయోగించుకుని అక్కడ ఘాట్లలో స్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకుంటారు. అదే విధంగా హైదరాబాద్ వైపు నుంచి వాహనాల్లో వచ్చే భక్తులు తమ వాహనాలను పున్నమి, భవానీఘాట్లలో పార్కింగ్ చేసుకుని కనకదుర్గమ్మ దర్శనానికి వెళుతున్నారు. అయితే వారంతా ఇక్కడ ఎందుకు స్నానాదులు చేయటం లేదంటే సెంటిమెంట్ ప్రధానాంశంగా చెప్పుకోవచ్చు. ఇంద్రకీలాద్రి దిగువన ఉన్న కేశఖండనశాలలో తలనీలాలు ఇవ్వటం, దుర్గా ఘాట్‌లో స్నానం చేయటం పుణ్యప్రదం అన్నది వారి విశ్వాసం. ఈ విధంగా ఉత్తరాది రాష్ట్రాల నుంచి దేవస్థానం రాజగోపురం వద్దకు వచ్చే భక్తులను దేవస్థానం బస్సులలో పున్నమి, భవానీ ఘాట్లకు తరలిస్తే దుర్గాఘాట్ వద్ద రద్దీ తగ్గటమే కాకుండా ఈ రెండు ఘాట్లలో చేసిన ఏర్పాట్లకు సార్థకత ఉంటుందని పలువురు భక్తులు వ్యాఖ్యానిస్తున్నారు. అయితే జిల్లా యంత్రాంగంలో ఉన్న వివిధ శాఖల అధికారుల మధ్య సమన్వయ లోపమే అందుకు కారణమని స్పష్టం అవుతుంది.



పున్నమి ఘాట్‌లో నిర్మానుష్యంగా ఉన్న స్టాల్స్

అవగాహన లేక ఇక్కట్లు

వీఐపీ పాస్‌లు ఉన్న అనేక మంది భక్తులు ఇంద్రకీలాద్రిపైకి వెళ్లి అమ్మవారి దర్శనం చేసుకునేందుకు బస్సుల కోసం మోడల్ గెస్ట్ హౌస్ దగ్గర ఎదురు చూస్తుండటం గమనార్హం. వాస్తవానికి వీఐపీల ప్రొటోకాల్ దర్శనాల కోసం పున్నమి ఘాట్ వద్ద దేవస్థానం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసింది. ఆ పాస్‌లు ఉన్నవారిని అక్కడ నుంచి దేవస్థానం బస్సులలో కొండపైకి పంపించే ఏర్పాట్లు చేశారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే వీఐపీ భక్తులకు అవగాహన లేకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా దేవస్థానం అధికారులు అటువంటి భక్తులకు అవగాహన కల్పించి సేవలందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జగన్మాత నమోస్తుతే !

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాల్లో నాల్గవ రోజైన ఆదివారం శ్రీచక్ర అధిష్టాదేవతైన శ్రీ లలితాత్రిపురసుందరీదేవిగా, శ్రీ గజలక్ష్మీదేవిగా వివిధ అవతరాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి స్వరూపమే శ్రీచక్రంగా పండితులు చెబుతున్నారు. శ్రీచక్రాన్ని ఆరాధించడం ద్వారా అమ్మవారి మరింత త్వరితంగా భక్తులను అనుగ్రహిస్తారని పురాణాలు చెబుతున్నాయని చెప్పారు. అందుకే ఆదిశంకరాచార్యులవారు దేశంలో వివిధ క్షేత్రాలను పర్యటించి ఆయా ప్రాంతాల్లో శ్రీచక్ర ప్రతిష్టాపన చేసినట్లు పలువురు చెబుతారు. అటువంటి మహిమాన్వితమైన శ్రీచక్ర అధిష్టానదేవతైన శ్రీ లలితాత్రిపురసుందరీదేవిని ఆదివారం లక్షలాది మంది భక్తులు దర్శించి, పూజలు నిర్వహించారు. ఆలయాల్లో కుంకుమార్చనలు, చండీహోమాలు, ఖడ్గమాలర్చాన తదితర వైదిక కార్యక్రమాలను ఆలయ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించారు.

పలు ఆలయాల్లో..

వన్‌టౌన్ బ్రాహ్మణవీధిలోని శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో శ్రీ పద్మావతిదేవి అమ్మవారు శ్రీ గజలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చకులు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి పర్యవేక్షించారు. శేషయ్యవీధిలోని శ్రీ కృష్ణ ప్రార్ధనా సంఘం ప్రాంగణంలో ఉన్న శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సందరీదేవిగా దర్శనమిచ్చారు. కుంకుమార్చనలు, సంకీర్తనాగానం నిర్వహించారు. ఉత్సవాలను కమిటీ అధ్యక్షుడు గోకవరపు మురళీకృష్ణ, కార్యదర్శి గుడిపాటి పాపారావులు పర్యవేక్షించారు. బ్రాహ్మణవీధిలోని శ్రీ చదును మహాలక్ష్మమ్మ దేవస్థానంలో అమ్మవారు లలితాత్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో కొలువై ఉన్న అష్టలక్ష్ములు ఐశ్వర్యలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కేటీ రోడ్డులోని శ్రీ గంగానమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు శ్రీ లలితాత్రిపురసుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కొత్తపేట సైకం వారి వీధిలోని శ్రీ దర్బేశ్వరస్వామి వారి దేవస్థానంలో పార్వతీ అమ్మవారు శ్రీ లలితత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు మురళీ కార్యక్రమాలను పర్యవేక్షించారు. పాత శివాలయంలో భ్రమరాంబ అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కేబీఎన్ కళాశాల ప్రాంగణంలోని దాసాంజనేయస్వామి వారి దేవస్థానంలో అమ్మవారు శ్రీ లలితాత్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చారు. ద్వి శత చండీయాగంలో భాగంగా ఉదయం హోమాలను నిర్వహించారు.

చిట్టినగర్‌లో విశేష పూజలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోని శ్రీమహాలక్ష్మి అమ్మవారు శ్రీఅన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భీమన వారి పేటలోని శ్రీ విజయదుర్గా అమ్మవారు శ్రీలలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పవన్‌కుమార్ భక్తులచే సామూహిక కుంకుమార్చనలను జరిపించారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ నిర్వహించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. పాలప్రాజెక్టు ఎదురుగా ఉన్న శ్రీ గంగానమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాలను శ్రీ దుర్గా గాయత్రి అర్చక, యాగ్నిక పురోహిత సేవా సంఘం అధ్యక్షులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహిస్తున్నారు. చైర్మన్ బసవ కాశీ విశ్వనాథ్, గౌరవ అధ్యక్షుడు సుంకర వెంకటేశ్వరరావు, ఉమ్మిశెట్టి వెంకట దుర్గాశివ నాగేంద్ర, నివేదిత దంపతులు, కుంచెం శ్రీనివాసరావు దంపతులు సహాయ సహకారాలు అందించారు. ఆయా ఉభయదాతల పేరిట అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భవానీపురంలో పూజలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం కోళ్ల ఫారం రోడ్‌లో ఏర్పాటు చేసిన దసరా ఉత్సవాల్లో శ్రీలలితా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఊర్మిళా సుబ్బారావునగర్ గ్రామ దేవత పోలేరమ్మ దేవస్థానంలో అమ్మవారు శ్రీఅన్నపూర్ణాదేవిగా అలంకరించారు. ఓల్డ్ హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోని సంకల్ప సిద్ధి శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో అమ్మవారు శ్రీలలితా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు.



లలితాత్రిపురసుందరీదేవిగా చదునుమహాలక్ష్మమ్మ మాత



కోళ్ల ఫారం రోడ్‌లో లలితాత్రిపుర సుందరీదేవిగా..



అన్నపూర్ణాదేవిగా భ్రమరాంబ అమ్మవారు



ఆలయ ప్రాంగణంలో నృత్య ప్రదర్శన



శ్రీ గజలక్ష్మిగా పద్మావతీదేవి



అన్నపూర్ణాదేవిగా మహాలక్ష్మి అమ్మవారు



విజయదుర్గా ఆలయంలో లలితా త్రిపుర సుందరీదేవిగా..



అన్నపూర్ణా దేవి అలంకారంలో పోలేరమ్మ

వరదల్లో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఇటీవల కృష్ణానది బుడమేరులకు వచ్చిన వరదల్లో నష్ట పోయిన రైతులు, కౌలు రైతులను పూర్తిస్థాయిలో ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాఘవయ్య పార్కు సమీపంలోని బాలోత్సవ భవన్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇంకా కొన్ని భూములకు, ఇతర పరికరాలకు నష్టపరిహారం నమోదు కూడా చేయలేదన్నారు. నమోదు కాని రైతులు, కౌలు రైతులు, ప్రజలకు సంబంధించి ఎన్యూమరేషన్ చేయడానికి మరో అవకాశం ఇవ్వాలన్నారు. వరదల కారణంగా అనేక గ్రామాల్లో వ్యవసాయ మోటార్లు, ఆయిల్ ఇంజన్లు, ట్రాక్టర్లు రోటావేటర్లు, అనేక పరికరాలు ఇసుక పట్టి పాడైపోయాయన్నారు. వీటిని ఎన్యూమరేషన్‌లో నమోదు చేయలేదని చెప్పారు. విజయవాడలో టూ వీలర్లకు, ఆటోలకు నష్టపరిహారం ఇస్తున్న ప్రభుత్వం ప్రజలందరికీ అన్నం పెట్టే సాగుదారుల విషయంలో వివక్షత పాటించటం సరి కాదన్నారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణాలను రీ షెడ్యూల్ చేసి ప్రభుత్వమే వడ్డీ కట్టి మళ్లీ కొత్తగా పంట రుణాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హరిబాబు, పక్కన కృష్ణయ్య, వెంకటేశ్వర్లు

వీరబాబు స్వామిని దర్శించుకున్న ఎంపీ కేశినేని చిన్ని



భవానీపురం(విజయవాడపశ్చిమ): తుమ్మలపల్లి కళాక్షేత్రం వెనుక భాగంలో ఉన్న శ్రీవీరబాబు స్వామి దేవస్థానానికి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) ఆదివారం వచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దసరా నవరాత్రుల సందర్భంగా ఆలయంలో నెలకొల్పిన శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా దేవస్థానం కమిటీ ఏర్పాటు చేసిన చిన్నారుల నృత్య ప్రదర్శనను తిలకించి వారిని అభినందించారు. అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన ప్రసాద వితరణలో పాల్గొని వడ్డించారు. కార్యక్రమంలో శ్రీవీరబాబు స్వామి దేవస్థానం కమిటీ అధ్యక్షుడు కొమ్మూరు బసవరాజు, ప్రధాన కార్యదర్శి గొంట్ల రామ్మోహన్‌రావు, కోశాధికారి కొప్పరపు వీరబాబు, ఉప కోశాధికారి బచ్చుల వెంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.